వ్యాస కౌముది




# మనలో మరో కుంతి - మహామహోజ్వల కాంతి

## మన ఆడపిల్లలని కాపాడుకోడానికి ఏడు సూత్రాలు

– చండాలుడు

"తన్నాను. గోళ్ళతో రక్కాను. ముఖం మీద ఉమ్మాను. చెయ్యివిడిపించుకుని లెంపకాయ కొట్టాను.... నేనెంత గిలగిల్లాడుతూ, తన్నుకుంటూ, ఏడుస్తున్నా లెక్కచేయక, తాను చేయదలచుకున్న పని పూర్తి చేసేవరకు వదలక, ఏడుస్తున్న నన్ను అక్కడే వదిలి బయటకు నడిచాడు." ("అసమాన అనసూయ, నా గురించి నేనే," వింజమూరి (అవసరాల) అనసూయాదేవి ఆత్మకథ, 84 పుట, ముద్రణ vangurifoundation.org వారు)




ఈవిడ పోయి ఈ మార్చ్ నెలకి ఏడాది. ప్రతినాడూ ఏదో ఒక వేళలో గుర్తుకు రావడమే. పడుకున్నా, నించున్నా, చెట్లు ఆకులు రాలుస్తున్నా ఆమె రూపం మెదులుతోంది.

అప్పుడే ఈడొచ్చిన ఆడపిల్ల ఎంత సుందరమైనది ఈ ప్రపంచం అని కిలకిలా నవ్వుతోంటేనూ, తగలబడుతోన్న అడవుల్లో అమాయక జీవరాశి మాడి నశిస్తూంటేనూ, చలం నిర్మిత మైదానాలలో విస్మయంగా గమ్యం తెలియక ఒంటరిగా పరుగులుపెడుతూంటేనూ నా కళ్ళముందు ఆమె ప్రత్యక్షం.

మగవాడి దుష్టవాంఛా మంటల్లో కాలి దగ్ధమైన కన్నెపిల్ల తల్లి విడిచిన కన్నీటిబొట్లు వరదలై పొంగి గట్లు తెంచుకొని ప్రపంచమంతటా హాహాకారాలతో పట్టపగలే పారినప్పుడు, నేను దైన్యంతో కూలబడ్డప్పుడు నా ముందు సాక్షాత్కారం అవుతోంది అనసూయాదేవి. హఠాత్తుగా అమ్మలా, అమ్మవారిలా, అర్ధరాత్రి అంకమ్మలా.

ఆ వేళ ఎడం చేతిలో ఏదో పట్టుకుని ఉంది. త్రిశూలం కాదు. ఆమె నేత్రాలలో కోపాగ్ని లేదు. అది కాదు వికసించిన కమలం. ఆమెలో కరుణ లేదు. మంత్రించిన విభూతి, నల్లటి తాయెత్తు, మెత్తటి చిక్కటి అంజనం కావు. ఆమె చూపులో అభయం లేదు. ఎంతో భయం వేసింది.

దావాగ్నిలా తరుముతోంది ఈమె నన్ను. ఎదో నాకు తెలియని మహత్కార్యానికి ఉసికొల్పుతోంది. అశక్తుణ్ణి నేను. బానిసనై ఊడిగం చేస్తూన్న నేను నీ ఆశలూ, ఆశయాలూ నెరవేర్చలేను తల్లీ. సమయం లేదు నా వద్ద. లేదు ఒక్క క్షణం కూడా.

అయినా చైతన్యం అణగారి వారగా ఒక మూల కూర్చున్న నన్నెట్లా పూనుకోమంటోంది ఈమె? అవును నాకు తెలుసు. అది ఆమెకూ నాకూ తప్ప మరెవ్వరికీ తెలియని రహస్యం. ఎన్నో ఏళ్ళక్రితం ఆమె రచనలో ఆమెను పట్టుకుని ఛేదించాను.

తల్లీకొడుకులం మేము. ప్రేయసీ ప్రియులం. ప్రకృతీ వికృతలం. బద్ధశత్రువులం. పరిచయంలేని ప్రాణమిత్రులం. స్త్రీ పురుషులం. వసుధైక కుటుంబీకులం.

పదిహేనేళ్ల కిందటివరకూ వింజమూరి (అవసరాల) అనసూయాదేవి అంటే ఎవరో తెలియదు. ఆవిడ పాట వినడం కాదుగదా, అసలు పేరే వినలేదు. ఏ పత్రికలోనూ చదవలేదు.

దేశాన్ని ముక్కలు ముక్కలు చేస్తామనే తీవ్రవాదులని, వారిని వెనకుండి నడిపించే రాజకీయ నాయకులని, వాళ్ళు చెప్పే దగాకోరు మాటలని ప్రముఖంగా ప్రచురిస్తారు. కళ సాయంతో దేశాన్ని ఏకం చేద్దామని బ్రతుకుని ధారపోసిన వారిని లోపలి పుటల్లో, చప్పటి వాక్యాల్లో దాచేస్తారు. దిక్కుమాలిన పత్రికలు.

ఇక అనసూయాదేవిలాంటి జానపద కళాకారులైతే పట్టించుకునేదెవరు. అసలు నేను పుట్టకమునుపే తెలుగువీరుడు ఇంగ్లీషులో గాఢంగా feel ఐపోతున్నాడు. వాడు చక్కటి తెలుగు సొంత పిల్లలతోనే మాట్లాడడం ఎప్పటినుంచో మానుకున్నాడు. ఇక పల్లెపాటకి దిక్కేది? దాన్ని వినేదెవరు? గౌరవించేదెవరు?

ఇంగ్లీషు మెలికల్లో పడి, వెలుగులీనుతున్న తెలుగువాళ్ళని గుర్తించలేకపోతున్నామే మనం. దారి తప్పిన దిక్కుమాలిన జాతి ఐనామె మనం. అయ్యో! పాపం ఈ వెర్రి, వృద్ధ కళాకారులు అసలు మననుండి ఏం ఆశిస్తారు? కిరీటాలా? హంసతూలికా తల్పాలా? ఒక్క నవ్వు. ఒక్క పువ్వు. ఒక మెచ్చుకోలు. ఇంతకంటే ఏం ఆశిస్తారు. ఇదే తెలుగునాట అత్యాశ ఐపోయింది. మండువేసవిలో వానచుక్క పట్టుకోవడం ఇంకా తేలిక.

అమెరికా వచ్చాక ఇంగ్లీషు రోగం కుదిరి నాలో మునుపటి తెలుగుప్రేమ మళ్ళీ బాగా హెచ్చరిల్లుతూన్న నాళ్ళల్లో, చక్కటి వాడుక తెలుగు నా కంటపడింది చీకట్లో మెరుపులా. అది అనసూయాదేవి రాసిన 'గతానికి స్వాగతం'. ఇది పుస్తక రూపంలో 'vangurifoundation.org' వారు తీసుకొచ్చారు.

అందులోంచి ఒక చిన్న సంఘటన. అనసూయాదేవి చిన్నతనంలో కాకినాడలో ఉండే వాళ్ళు. ఓ నాడు వాళ్ళ యింట్లో ఒక పెద్దావిడ పెరట్లో ఆకాశంలోంచి దూరంగా ఏదో పద్దం చూసిందిట. చప్పున ఇంట్లోకి వచ్చి 'పైనుంచి ఏవో దోసకాయల్లా వున్నాయి కింద పడుతున్నాయి.' అని అందరికీ చెప్పారుట.

అది రెండవ ప్రపంచ యుద్ధకాలం. మనం ఇంకా బ్రిటీష్ పాలనలో వున్నాం. కాకినాడ రేవు పట్నంపై జపాన్ బాంబులు వేసింది. ఆ దోసకాయలు బాంబులు. అంత అమాయకంగా ఉండేవాళ్ళు మనవాళ్ళు అని వ్రాసింది ఈవిడ. అప్పటినుంచి ఇంకా ఆసక్తిగా చదువుతూ వుండేవాడిని. ఒకచోట గమ్మున "మా మేనమామ దేవులపల్లి కృష్ణశాస్త్రి" అని కనబడింది. ఈవిడ దేవులపల్లి మేనకోడలా అని ఇంకా ఆత్రంగా చదవడం మొదలుపెట్టాను. ఈవిడ గురించికన్నా కృష్ణశాస్త్రి గురించి వివరం ఏమైనా దొరుకుతుందేమోనని.

అప్పటికింకా మనవాళ్ల జీవిత రహస్యాలు సన్నిహితుల గుండె గూళ్ళల్లోనూ , చీకటి అరల్లోనూ దాక్కొని, youtubeలో బట్టబయలవ్వని నాళ్ళవి. తెలుసుకోవాలని ఎంత ఆత్రుత! ఎంత కలవరం!!

మొదట గతానికి స్వాగతం చదవాలంటే ఏదోలా ఉండేది. "నా గొంతు బాగుందని పొగిడారు. నేను కేంథర్ డైన్ హెయిరాయిల్ వాడాను." రెండు వాక్యాలే. ఐనా ఇట్లా రాస్తే ఎట్లా అని? అప్పట్లో పుట్టుకతోటే మహాకళాకారిణి ఐన ఆమెని తూచే స్థాయి నాలో లేకపోయింది.

ఇన్నేళ్ళలో నాలో పెద్ద మార్పేమీ లేదు. అదే హృదయపు రొద. మస్తిష్కంలో అదే చలికాలం ఇంకా పొద్దు పొడవకముందు మసకచీకట్లలో శరీరాన్ని స్వల్పంగా కంపింపచేసే సూదుల తుంపర.

పాపం అనిపించింది ఇప్పుడు ఆలోచిస్తే. ఆవిడ జుట్టు సంరక్షణ గురించి రాసింది. ఆడవాళ్లు చక్కగా అలంకరించుకుంటారు. మగవాడిలా మొరటుగా ఎలా ఉంటారు? బారెడు జుత్తుని నూనె రాసి దువ్వుతూ, చేతులతో నిమురుతూ సంరక్షించుకోవడం స్త్రీకి సహజం. అదే ఆమె రాసింది. ఆమె ప్రకృతి.

మొజార్ట్ లాగ ఐదేళ్ల వయస్సులో మొట్టమొదటి సారి హార్మోనియం పెట్టె చూడగానే ఎవరూ నేర్పకుండానే చిన్నారి చేతులతో వాయించడం మొదలుపెట్టింది అనసూయాదేవి. దీనికితోడు చిన్నప్పటినుంచి మధురమైన కంఠస్వరం ఈమెది. లేత గొంతుతో సుస్వరంతో ఆలాపిస్తున్న ఆడపిల్లని ఆశీర్వదిస్తూ 'నీ గొంతు బాగుందమ్మా' అని అందరూ అనడంలో ఆశ్చర్యంలేదు. అదే ఆవిడ గుర్తుచేసుకుంటూ రాసుకుంది.

చదవగా చదవగా, మెల్లిమెల్లిగా ఆ కాలంనాటి సంగతులూ, జరిగిన సంఘటనలూ కళ్ళముందు కనబడేవి. రచనలోని తెలుగుతనం, పాలలాటి స్వచ్ఛత నన్ను బాగా ఆకర్షించాయి.

వాటిని మించి ఆవిడలో ఏదో విశాలమైన ఆలోచనా దృక్పథం, గంభీరత వున్నాయని తోచింది. అప్పటికింకా ఆవిడ జీవితంలో పడిన వర్ణించ శఖ్యం కాని, ఏ ఆడదీ భరించలేని యాతన నాకు ఏమాత్రం కొంచెం కూడా లీలగానైనా తెలీదు. ఆమె నల్లటి కళ్ళలోకి తొంగిచూస్తే సన్నగా పొడుగాటి ఎర్ర జీర. బంగాళాఖాతం వొడ్డున ఇంకా సొంతం పొద్దు కుంకకముందు పాములా వంకరులు తిరిగిన ఎర్రని విద్యుత్ తీగలాగ.

అప్పట్లో ఆ జీర వెనకున్న అఖాతాన్ని పసికట్టలేకపోయాను. ఆవిడ ఆత్మకథ చదివేకగాని తెలుసుకోలేకపోయాను. ఆడది ఒక్కసారి నవ్వుతూ స్నేహంగా చూడగానే అనేకానేక మనోవికారాలకి లోనై మొరటుగా ప్రవర్తించే మృగజాతికి చెందినవాడిని. మగవాడిని. నాకెట్లా తెలుస్తుంది ఆమెలో అంత బడబాగ్ని దాగి ఉందని?

తెలిస్తేనే ఆశ్చర్యం. తెలియకపోడం సర్వ సాధారణం. మగజాతికి అది మామూలు కదా. కాదా మిత్రమా? మృగజాతికి అది మామూలు కాదా?

గుండె మీద చెయ్యి వేసుకుని, దిశ సాక్షిగా, ఎర్రబారిన తూర్పుదిశ సాక్షిగా, రతికేళి సాక్షిగా, ఖడ్గపాళి సాక్షిగా, బహు కోమలి తల్లి భారతి సాక్షిగా, నిర్భయులై భయంలేని నిర్భయ సాక్షిగా చెప్పు.

ఓ పురుష పుంగవా, ఓ నరశార్దూలా ఆలోచించు. ఒప్పుకోలే మొదటి మెట్టు. ఒకే ఒక్క మెట్టు. నాతో రా, హిమాలయ పర్వత శ్రేణులను చేరుకొని, కైలాస శిఖరాన్ని అధిరోహించి, ఆయమ్మ పాదాలని పట్టుకుందాం. మనందరికీ అమ్మ, అమ్మలని కన్న అమ్మ. పెద్దమ్మ. ఒక్క అంగలో దూకుదాం. ఆమె రథం అక్కడ ఆగింది. నేను చూసాను.

మన తెలుగు గడ్డమీద ఇంత నిజాయితీగా, ధైర్యంగా జీవితాన్ని జీవించిన వారు లేరు. ఉన్నా ఇలా ఇంత మనోవికాసంతో సొంత కథని పుస్తక రూపంలో తెచ్చి ఉన్నది ఉన్నట్టుగా చెప్పుకున్న వారు లేరు. లేరు. లేరు.

కుంతి భయపడింది. ఈవిడ కాంతి. కళ్ళు చెదరగొట్టే, జ్ఞాన నేత్రాలని వెలిగించే, మహామహోజ్వల కాంతి.


"[1945] నా పుట్టినరోజు.. అతి ముఖ్యమైన మాట మాట్లాడాలంటూ ... 10 ఏళ్లుగా నీ కోసం తపస్సు చేస్తున్నాను. ..నాకేం లోపం? చదువుంది... డబ్బు గడించాను...

అంతా నీకోసమే.. నీ దాసుణ్ణి.. నిన్ను సుఖపెట్టగలను .. ప్రాణాలతో వదలను.. నిన్ను చంపి నేను చచ్చిపోతాను... అరవకు.. " [అసమాన అనసూయ, 81 పుట ]

Vauxhall Motors Limited is a British car company... a luxury-car brand before the Second World War (wikipedia). పద్మశ్రీ చిత్తూరు నాగయ్యగారి దగ్గర ఈ కారు ఉండేది. ఎడ్లబళ్ల కాలంలో ఈ ఒక్క కారే కాదు ఇంకా మొత్తం తొమ్మిది కార్లు ఉండేవి ఆయన దగ్గిర. చిత్ర రంగానికి వచ్చిన తొలినాళ్లలో తన కారుని తనే తోలుతూ ఉండేవారు.

అది 1936 ప్రాంతం. ఒకనాడు ఆయన కారు వేగంగా పోనిస్తూ ఉంటే ఓ కుక్క అడ్డంగా వచ్చి కారు కింద పడి చచ్చిపోయింది. ఆయన మానసికంగా బాధపడ్డాడు. నా తొందరపాటు నోరులేని అమాయక జీవి ప్రాణాలను బలి పెట్టుకున్నది అని దైవం ముందు నిల్చుని ఇంకెప్పుడూ కారు నడపను అని ప్రమాణం చేసాడు. నాటినుంచి కారు driving జోలికే పోలేదు నాగయ్య.

దయామయుడు ఉప్పలదడియం "చిత్తూరు" నాగయ్య. దక్షిణభారత నటుల్లో మొదటి పద్మశ్రీ ఈయనకే వచ్చిందని అంటారు. పిల్లలని చేరదియ్యడం, చదువులు చెప్పించడం, బడులకు విరాళాలు ఇవ్వడం, పెళ్లిళ్లు చేయించడం చాలా మాములు ఈయనకి.



త్యాగరాజు జన్మస్థలమైన తిరువాయూరులో సంగీత పాఠశాల కోసం పదివేల రూపాయలు విరాళంగా యిచ్చారు. ఏటా జరిగే సంగీత సభలకి వచ్చే మాహావిద్వాంసులందరికీ అది నిలయమైంది.

శ్రీశ్రీ తన స్వీయచరిత్రలో నాగయ్య గురించి ఇట్లా రాసాడు. "నాటినుండీ నేటివరకూ నల్ల డబ్బు తీసుకోని వ్యక్తిగా నాకూ, చనిపోయిన చిత్తూరు నాగయ్యగారికి... ఆ గౌరవం దక్కింది." (అనంతం, పుట 61, 2006 ముద్రణ)

దయాగుణానికి, ఎడతెరిపిలేని దానాలకు, నీతీ నిజాయితీలకు మరోపేరు నాగయ్య.

నాగయ్యగారి స్వీయచరిత్రలో ఒక సంఘటన చూద్దాం. నాగయ్య బ్రతికుండగానే ఇది విజయచిత్ర పత్రికలో అచ్చయ్యింది. అప్పటికే అందరికీ, ముఖ్యంగా ఆయన సన్నిహితులకీ, కలిసి పనిచేసిన వారికీ తెలుసు.

నాగయ్యకి మొదటి భార్య పోగా, రెండో పెళ్లి చేసుకున్నాడు. రెండో భార్య కూడా పాపం పోయింది. ఆయన ఒంటరిగా ఉండేవాడు మద్రాసులో. పిల్లలు లేరు. కృష్ణస్వామి నాయుడుగారు అనే forester పుత్తూరులో ఉండేవారు. నాగయ్య ఆయనను అంతకుముందు బాగా ఎరుగుదును. ఆయన భార్య, ఇద్దరు కూతుళ్లు మద్రాసులో నాగయ్య ఇంట్లో ఉండేవారు.

ఒకసారి పెద్ద కూతురు జయలక్ష్మిని వదిలి, ఆయన, భార్య, చిన్న కూతురు వేరే ఊరికి వెళ్లారు. అప్పుడు జరిగిన సంఘటన. నాగయ్య తన జీవిత చరిత్రలో వ్రాసుకున్నది, వున్నది వున్నట్లుగా.

"...పక్కగదిలో జయలక్ష్మి ఒక్కతే నిద్రపోతున్నది. .. ఉద్రేకం నాలో చెలరేగింది.... సామాన్య మానవుడు అరికట్టుకోలేని సమయం అది... నేను నెమ్మదిగా వెళ్లి జయలక్ష్మి గది తలుపుల్ని కొట్టాను. ఆమె తలుపుతీసి ఆగమ్యంగా చూసింది. నేను ఆమెను చూస్తూ నిలుచున్నాను. ఆమె భయపడింది. నేను దగ్గరకు తీసుకోబోయాను. "వద్దు, మీరు పెద్దవారు. మంచి చెడ్డలు తెలిసినవారు. నన్ను పాడుచేశారనే మచ్చ మీకు రావడం నేను ఎన్నడూ వాంఛించను నన్ను క్షమించండి. నా భావిజీవితం గురించి ఆలోచించండి. నేనేమయిపోతాను?" అంటూ విలపించసాగింది. నేను ఆమెకు నచ్చజెప్పాను. తనను బాగా చదివిస్తానన్నాను. . . జీవితాంతం నిన్ను ఏలుకుంటాను. నిన్ను అన్యాయం చేసి నడివీధిలో విడిచిపెట్టి వెళ్లే మనస్తత్వం నాది కాదు. నన్ను నమ్ము. అన్ని విషయాలు మీ నాన్నగారితో మాట్లాడతాను" అని ఆమెను దగ్గిరకు తీసుకుని కౌగిట చేర్చుకున్నాను. " [స్వీయచరిత్ర, నాగయ్య, పుట 87, ముద్రణ 2004]

ఆ మరునాడే వడపళని దేవాలయానికి వెళ్లి దండలు మార్చుకుని వివాహంచేసుకున్నాడు జయలక్ష్మిని. నాగయ్య మాట ప్రకారం ఆమెని S.S.l.C దాకా చదివించాడు. ఆ పైన చదువు ఆమె వద్దన్నది.

దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని పొందిన B. N. రెడ్డి నాగయ్య అంటే ఎంతో ఇష్టపడేవారు. ఆయన తీసిన చిత్రాలెన్నింటిలోనో నాగయ్య నటించాడు. నాగయ్య 1973లో మరణించినప్పుడు రెడ్డిగారు గుండెలకి హత్తుకునేలా రాసిన మాటల్లో నాగయ్య గొప్పతనం కళ్ళకి కట్టినట్టుకనబడుతుంది. "రకరకాల పిచ్చి తీగలతో పాచి పట్టిన సినిమా బురద మడుగులో విజ్ఞాన వికాసాలను,కళా కాంతులను వెదజల్లుతూ తెలుగుదేశంలో సభ్యత సంస్కారం గల సహృదయలను పరవశింపజేసి వారి హృదయాలలో నివసించే సుందర పద్మం మా నాగయ్య. పసిపిల్లవాడిలా నేను నాగయ్య పాట వింటూ కన్నీరు పెట్టిన దృశ్యాలు ఇప్పటికీ మరచిపోలేను. మా నాగయ్యలో త్యాగయ్యని చూచేవాడిని. .. వినయవిధేయులు, తన్నుమాలిన ధర్మపరులు, దయార్ద్ర హృదయులు, పరోపకారి,... దైవాంశసంభూతుడైన మహాకళాకారుడు మా నాగయ్య..." [పుట 108]

ఇది ఏభై ఏళ్ల క్రితం వ్రాసిన నివాళి. ఎంత ఘనంగా, హృద్యంగా వ్రాసాడీయన. నాగయ్య ఒక సుందర పద్మం. దైవాంశసంభూతుడైన కళాకారుడు. ఇంతకంటే ఒక నటుడిని, మనిషిని ఎవరైనా కీర్తించగలరా? నాకు ఈ మాటలకంటే ఇంకొకటి బాగా నచ్చింది. ఈ నివాళిలో 'మా నాగయ్య, మా నాగయ్య' అంటూనే వ్రాసుకొన్నారు. ఈ 'మా' అనే వాడుక ఆప్యాయత, ఆత్మీయత కలిపి మిశ్రమిస్తే గానీ రాదు. ఎన్నో ఏళ్ల తరబడి సాన్నిహిత్యంలో సుఖదుఃఖాలని పంచుకొంటే గాని రాదు. చాలా మనస్సుకి దగ్గిరైన వాళ్ళకీ ,పరమ ఆత్మీయులకీ తప్ప అందరికీ ఈ మాట పడదు.

కోపం తట్టుకోలేకపోయింది... నా ఇష్టమొచ్చిన చోటికి వెడుతున్నాను, .. అంటూ బయటకి నడిచాను. ఇలాగ ఇల్లు వదిలి వెళ్లడం తప్పని నచ్చచెప్పి, మందలించి,

మంచి మాటలతో ఆపవలసిన ... అనుసరించాడు. [పాట కచేరీకొచ్చిన జనం] నిశ్చష్టులై చూస్తూ ఊరుకున్నారు. [అసమాన అనసూయ, పుట 83]

కోరిక, మగవాడి పశుబలం, చీకటీ వున్నంతకాలం యీ దాష్టీకాలుంటాయి. కానీ ఈ మధ్య మనం వింటూన్న ఇంత క్రూరమైన నేరాల దుస్థితి నుంచి మన ఆడపిల్లల్ని కాపాడుకోవాలి. మన ఆడపిల్లలు మన బిడ్డలు. మన సంపద. రక్షణ బాధ్యత కూడా మనదే.

ఏ ప్రభుత్వమో వచ్చి ఏదో చేస్తుందనే వెర్రినుంచి బయటపడాలి. ప్రభుత్వాలని నిందించి ఏమీ ప్రయోజనం లేదు. ప్రభుత్వాలు వస్తూంటాయి, పోతూంటాయి. మంత్రులు వస్తుంటారు, మారుతుంటారు. మంత్రులకి అన్నీ తెలుస్తాయి అనుకోవడం పొరపాటు. వారి దగ్గిర అధికారం ఉంది, జ్ఞానం లేదు. అది మనం యివ్వాలి.

ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో మనం చేసి చూపించాలి. అంతర్జాలం వచ్చాక దృశ్య కావ్యాలని నిర్మిచడం తేలిక. అధికారులనీ, వారి యంత్రాంగాన్నీ, మంత్రులనీ వాడుకోవాలి. వాళ్లకీ ఆడపిల్లలున్నారు, కుటుంబాలున్నాయి. మన ఆడపిల్లలకి ఆత్మరక్షణ ఉపాయాలూ, వ్యూహాలూ ఇవ్వాలి. ముఖ్యంగా పేదలకీ, పనిమనుషులకీ, వాళ్ళ పిల్లలకీ, మారుమూల గ్రామాలలో బడికి భయపడుతూ వెళుతున్న కన్నెపిల్లలకి, వాళ్ళ తల్లితండ్రులకి మనం ఏమీ చెప్పలేమా?

ఆడపిల్లలకి మగవాడి స్వరూపం, నైజం ఎరుకపర్చాలి. వాళ్ళని వాళ్ళే కాపాడుకొనే ధైర్యాన్నీ, స్థైర్యాన్నీ ఇవ్వాలి.

ఇప్పటి దిక్కుమాలిన చదువుల్లో వీటి గురించిన ప్రసక్తి లేదు. ఇంగ్లీషు అనువాదాల్లో దొరకదు. దక్షిణాఫ్రికా, స్వీడెన్, స్విట్జర్లాండ్ దేశాలలో ఎక్కువ అమానుషాలు జరుగుతున్నాయి. పశ్చిమ దేశాలనుంచి ఎదో నేర్చుకోవాలనుకోవడం కంటే అమాయకత్వం లేదు. మనకి బోలెడు స్త్రీవాద రచయిత్రులూ, తల్లులూ వున్నారు. కుటుంబ వ్యవస్థని కాపాడుకోడంలో భారతీయ స్త్రీకి తెలియని విషయాలు ప్రపంచంలో ఇంకెవరికీ తెలియవని నేను నమ్ముతున్నాను.

ముందుగా మగవాడు చెప్పే మాయదారి మాటలు పసిగట్టే జ్ఞానాన్ని ఆడపిల్లలకి బోధించాలి. మగవాడు కోరిక తీరడం కోసం ఎన్నిమాటలైనా ఆడతాడు. బ్రహ్మాండమైన రహస్యం ఒకటి నీ ఒక్కరితోనే మాట్లాడాలన్నట్లుగా ఎవరూ లేని చోటికి తీసుకుపోతాడు. లేకపోతే ఎవరూ లేనప్పుడు వస్తాడు. సాధారణంగా వాడికి కూడా తెలియదు చివర ఎలా ముగుస్తుందో. కానీ వాడిలోని పశుత్వం అలా నడిపిస్తుంది. అటూ ఇటు నడుస్తూన్నట్లు నటిస్తూ శరీరాన్ని తాకుతాడు. నడుం మీద చెయ్యివేస్తాడు. అంతా నీ కోసమే అంటాడు. నువ్వు వద్దంటే నేను చస్తాను అన్నవాడల్లా తిరస్కరిస్తే నిన్ను చంపుతానంటాడు. ఇష్టంలేని దానివి మరి ఆనాడు ఎందుకు నన్ను చూసి నవ్వావు అంటాడు. ఆమె మెదడు మొద్దుబారిపోతుంది. వెళ్ళిపోతాడు నిర్జీవంగా పడివున్న ఆ పిల్లని వదిలి. మర్నాడు మళ్ళీ మొదలు. ఆడదాని శరీరంలో మార్పులు రావడం మొదలుపెడతాయి. తెలియగానే భయపడి పారిపోతాడు. కాదని దబాయిస్తాడు. ఇదే చిన్నచిన్న మార్పులతో ప్రపంచమంతా అనాదిగా పునరావృతమౌతోంది.

మంచి చదువు, వినయము, సంస్కారము వున్న మగవాడు కూడా ఒంటరిగా వున్న ఆడదాన్ని చూస్తే తమాయించుకోలేడు అన్న విషయాన్నితెలియచెప్పాలి. మంచివాళ్ళు, చెడ్డవాళ్లు అని రెండు వర్గాలు లేరు. పరమ దుర్మార్గులని పక్కనపెడితే, మంచీచెడుల కలపోతే మగవాడు. వాడి ముందు ఆడది అనాదిగా ఓడిపోతోంది. ఆ అవకాశం రాకుండా చూసుకోవాలి.

దయామయుడు, పరోపకారి, గొప్ప సంస్కారవంతుడైన నాగయ్య గారు రాసిన మాటలు "ఉద్రేకం నాలో చెలరేగింది...సామాన్య మానవుడు అరికట్టుకోలేని సమయం అది... " గాంధీ, నాగయ్య ఇద్దరూ మహాత్ములే నా దృష్టిలో. నిష్కల్మషంగా గొప్ప మనోవికాసంతో వాళ్ళ జీవిత చరిత్రలు రాసుకున్నారు. మనకి అవి గుణపాఠాలు. ఏ భాషైనా, ఏ దేశమైనా ప్రపంచంలోని ప్రతి మగవాడికీ వర్తిస్తాయి.ఇవి కళాశాలల పాఠ్య పుస్తకాలల్లో చేర్చాలి.

చీకటికి దూరంగానూ, దీపానికి దగ్గిరగానూ చేరండి. ఎవరూ లేని చోటినుండి నలుగురు మసలే చోటకి తరలండి.

అమ్మా,నాన్న, తోబుట్టువల గురించి మాటల్లో చెప్పండి. వారి ప్రసక్తి తీసుకురండి. మీరు ఒంటరి కారని, మీ వెనక బలగం ఉందని తెలుస్తుంది. సెల్ ఫోన్ లో మీకు తెలిసిన వాళ్ళని పలకరించండి. మీ కదలికలు చెప్పండి పక్కవారు వినేట్టుగా.

గట్టిగా అరవడం, అరిచి వాణ్ని భయపెట్టడం నేర్చుకోండి. ఈ సూత్రం రాస్తోంటే రాతియుగానికి పోయినట్లనిపిస్తోంది. కుటుంబమే కవచం అని తెలియచెప్పాలి. అన్నదమ్ములు, తలితండ్రులు, అత్తమ్మలూ, తాతమ్మలూ చుట్టూ ఉండగా ఆడపిల్లలకి ఏం భయం? ఒకప్పటి మన పల్లెటూళ్ళల్లో వీధివీధంతా తెలిసిన వాళ్ళే వుండేవారు. ఉమ్మడి కుటుంబాలూ, దగ్గిర బంధువులూ, చిన్నప్పటినుంచి బాగా తెలిసినవారే

ఉండేవారు. పగలల్లా తలుపులు  తెరిచే ఉండేవి. మా చిన్నతనంలో ఎవరింటికి వెళ్లినా తలుపు కొట్టాల్సిన పని  వుండేదికాదు. రహస్యాలు వుండేవి కావు. పిల్లాడు పరీక్ష తప్పినా, కోడలు నెల తప్పినా, ఎవరింట్లో ఏం జరిగినా, మంచైనా, చెడైనా నిముషాల్లో ఊరు ఊరంతటికీ తెలిసిపోయేది. అంటే నిరంతర నిఘా ఉండేది. అదే రక్ష.  వీళ్లు చూస్తున్నారని వాళ్లు, వాళ్లు చూస్తున్నారని వీళ్ళు అంతా కట్టుదిట్టంలో ఉండేవారు. ఎంతటి దుర్మార్గుడైనా బరి తెగించేవాడు కాదు.  ఇంత క్రూరంగా సామూహికంగా జరిగిన సంఘటనలు లేవు.

మంచి రంగులో వుండి, ఇంగ్లీషు బాగా జొప్పించి ధారాళంగా మాట్లాడుతూన్న వాళ్ళంతా సంస్కారవంతులనుకొనే  అమాయకత్వం నుంచి ఆడపిల్లలని, ముఖ్యంగా వాళ్ళ తల్లులని బయటపడేయాలి.  బ్రిటీష్ వాడు వదిలిపోయిన చదువుల వలన సంస్కారం అబ్బదు.

చిన్నప్పుడు చదివే పుస్తకాలు, చూసే దృశ్యాలు, చిత్రాలు వీటి ప్రభావం ఎక్కువ.  వేమన తెలియకపోతే  నీతి తెలియదు.  చందమామ తెరవకపోతే ఉపాయం, సాహసం తెలియవు.  కాళిదాసు, చలం చదవకపోతే స్త్రీ తెలియదు. పంచతంత్రం, భారతం లేకుండా లోకం పోకడ తెలియదు.  జీవన రహస్యం  తెలియదు.

ఇవి చదవడం వల్ల ధర్మం తెలిసి, ఒక కవచం ఏర్పడుతుంది. మంచీచెడు పై  విచక్షణ ఎక్కువై, స్పష్టత లభిస్తుంది. ఏదో ఒక అంతర్గత శక్తి నిరంతరం హెచ్చరిస్తూంటుంది స్త్రీపురుషులని ఇద్దరినీ కూడా. అతి దుర్మార్గుడు దుర్మార్గుడిగానూ, దుర్మార్గుడు మామూలు మనిషిగానూఅయ్యే అవకాశం ఎక్కువ.  మామూలు వాడిలో తీవ్రత తగ్గుతుంది.

ఆడపిల్లలకి జ్ఞానంతోబాటుగా  ధైర్యం, స్వేచ్ఛ ఇవ్వాలి. వాళ్ళకీ మనసుందని, దానికీ ఇష్టాయిష్టాలుంటాయని గ్రహించి, గౌరవించాలి.

❦❦❦

"అందమైనవారు. చాలా తెలివైనవారు కూడా... There is something sweet... సేవలు గొనుటయేగాని సేవించుటెరుగను, ప్రేమింపబడుటయేగాని ప్రేమించుటెరుగను  .. కాస్త చలించానంటే, ఒక వేళా అదే లవ్ ఏమో!" ......  మొదట్లోనే ముళ్ళదారిలోకి మళ్ళబోయిన జీవితాన్ని సువాసన పూరితమైన నందనవనంలోకి మరలించుకున్నాను... నాకు 5గురు పిల్లలు... పంచప్రాణాలు. .నాకు 95 ఏళ్ళు. ... వైకుంఠపాళీ ఆటలో ఎంత నీతి, నిజం ఉందొ ఇప్పుడర్థమైంది. పెద్ద నిచ్చెనెక్కి పైకి వెళ్లిన నేను, తక్షణమే పెద్దపాము నోట్లో పడి కిందకు వచ్చాను. అయితేనేం పందాలు వేసుకుంటూ 'పరమపదం  వరకు చేరాను. ఇంక భయం లేదు. ఎక్కువ దూరం లేదు.... " [అసమాన అనసూయ, 130 పుట]

ఈవిడ ఆత్మకథ చదివి నివ్వెరపోయాను.  నన్నొక విసురు విసిరింది  గాలిదుమారంలా ఆవిడ రాసిన తీరు.  పైగా సొంతమనిషి గురించి, పరాయివాడు కాదు. నలభై ఏభై ఏళ్ళు కాపురం.  పిల్లలు పెద్దవాళ్ళైపోయారు. మనవలు, మనవరాళ్లు. వాళ్లకి అతను నాన్న, తాతయ్య. అయినా ఒక్కటి కూడా  దాచి పెట్టలేదు ఆవిడ.  కళ్లకి కట్టినట్టుగా రాసింది. ఇది నిజాయితీ, ధైర్యం, మనోవికాసం. పదాలు అందట్లేదు.

ఒకటికి పదిసార్లు ఆలోచించాను. సంశయించాను. వీళ్ళ జీవితాల్లో కఠినమైన, క్లిష్టమైన కోణాలని గూర్చి ఇంతలా వ్రాయాలా అని? అందరికీ మింగుడుపడని అంశాలు ఇవి. పోయిపోయి ఇంత గొప్పవాళ్ళగురించి అన్నీ వదిలేసి ఇవి రాస్తున్నానే అని నాకు నేనే ప్రశ్నించుకున్నాను. ఎక్కడో ఒక మూల నాకు అనిపిస్తోంది వాళ్ళ స్వీయచరిత్రలలో తామే ఈ విషయాలు కప్పిపెట్టకుండా రాసుకుని ప్రకటించుకున్నారంటే ఏదో అర్థం – పరమార్థం ఉండి తీరుతుంది అని.

నా అనుభవంలో ఇలాంటి వ్యక్తిత్వం నాకెప్పుడూ తారసపడలేదు. సంఘటన కొత్తది కాదు. అవి వేలూ, లక్షల్లో జరుగుతున్నాయి. బయటకి వచ్చేవి ఒక శాతంలో వందో శాతం. కానీ ఇలా ప్రపంచం ముందు నిలుచుని, గొంతు చించుకొని, పుస్తకాలు ముద్రించుకొని చెప్పిన వాళ్లెవరు? ఎప్పుడో స్వతంత్రం రాక ముందు జరిగిన సంఘటన. ఎందుకుని అంత శ్రమ పడింది ఆవిడ?

ఇది తప్పని సరిగా ఆవిడ ఈనాటి కన్నెపిల్లలకి తెలియాలనే వ్రాసింది. నేర్చుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటారనే వ్రాసింది. తన చేదు అనుభవం ఒక గుణపాఠంగా మలుస్తోంది ఆవిడ. ఈవిడ ప్రయత్నం తెలుగు చరిత్రలో నా ఎరుకలో ఇదివరకెన్నడూ లేదు. ఈవిడ రచనలో న్యాయస్థానాల్లో వినబడే నింద, ఆరోపణ రెండూ లేవు. జీవితం ఉంది. నిప్పులాటి నిజం వుంది.

మగవాడి నైజం చెప్పే ప్రయత్నంలో నాగయ్యగారి జీవితం గుర్తుకు వచ్చింది. ఆయన జీవిత చరిత్ర బతికున్నప్పుడే ఆయన రాసుకున్నాడు. ఎప్పుడో చదివాను. నా ఆలోచన ఏమిటంటే గొప్ప సంస్కారి, దయామయుడు అయిన నాగయ్య కూడా అసహాయురాలైన ఆడదాన్ని చూస్తే దారి తప్పుతాడు అని.

మళ్ళీ ఆగాను. ఈయన గురించి ఇలా వ్రాయవచ్చా? మంచివాడు నాగయ్య. ఎన్నో మంచి పనులు చేసాడు. ఈ ఒక్కటి పట్టుకుని మీరు చెడు ప్రచారం చేస్తున్నారనే మాట వస్తుంది. కానీ నాగయ్య కావలిసే మనోవికాసంతోనే ఆయన జీవిత చరిత్రలో ప్రకటించుకున్నాడని నా మనస్సు ఘోషపెడుతోంది. కానీ ఋజువేది? నాగయ్య పోయి ఏభై ఏళ్ళు అవుతోంది. ఎవరు చెప్తారు?

విధి చిత్రాలు చేస్తుంది. మాయ చేస్తుంది. సరిగ్గా ఒక రెండు వారాల క్రితం ఋజువు దొరికింది. B. K. ఈశ్వర్ అనే పాత్రికేయుడు youtubeలో నాగయ్య గారి గురించి చెబుతూ 'నాకీ సంఘటన ఆయన స్వయంగా చెప్పారు. ఆయన్ని అడిగాను ఇది కూడా పుస్తకంలో రాయాలా అని. దానికి నాగయ్యగారు తప్పకుండా రాయాలని, అది నిజంగా జరిగిందని.' ఈశ్వర్ విజయచిత్ర పత్రికకి పనిచేస్తూండే వారు. రావి కొండలరావు నాగయ్యని జీవిత చరిత్రకి ఒప్పించి, ఈశ్వర్ ని నెలనెలా పంపిచి రికార్డింగ్ చేసినట్లుగా కనిపిస్తోంది.

నాగయ్యకి నాగయ్యే సాటి. అనసూయాదేవికి అనసూయాదేవే సాటి. ఇద్దరూ సమాజ హితం కోరినవారు. మనోనేత్రం తెరుచుకున్నవారు. ఇద్దరూ బతికుండగానే జీవిత చరిత్రలు ప్రకటించుకొన్నారు. అపవాదుకి భయపడలేదు. కళాప్రపూర్ణ ఒకరు. రాజులచేత పాదపూజలు చేయించుకున్నవాళ్లొకరు.

సుదీర్ఘమైన వాళ్ళ జీవితాలలో కొద్ది నిమిషాలకి ఇంత ప్రాముఖ్యత ఇవ్వనక్కరలేదు. బాహాటంగా పుస్తకాలలోకి వ్రాసుకుని మరీ చెప్పనక్కర్లేదు. ఇది సగటు ఆలోచన. కానీ నాలాటి వాడొకడు పుడతాడని, వాడి గుండెలు ముక్కలై, వాడి హృదయం కరిగి, మరిగి, ఆవిరై యజ్ఞ ధూమంలా వారు నివసిస్తూన్న లోకాలకి పంపుతానని తెలుసునేమో.

నాగయ్యగారు మాటకి కట్టుబడ్డాడు. మర్నాడే గుడిలో ఆ పిల్లని పెళ్లి చేసుకుని అన్నమాటని నిలబెట్టుకుని, జీవితాంతం కాపరం చేసాడు. ఇక అనసూయాదేవి స్వయంగా చెప్పుకుంది. ముందే ముళ్లబాటలోకి వెళ్లిన జీవితాన్ని నందనవనంగా మార్చుకున్నాను అని.

అయితే వీళిద్దరికీ ముఖ్యమైన తేడా ఉంది. నాగయ్య మొగవాడు. అనసూయాదేవి కలలూ కళలూ ఛిద్రమై బతుకు భారాన్ని రెండు తక్కువ నూరేళ్లు మోసిన ఆడది. అదీ ఎలా మోసింది అంటే, కడుపులో తిమింగలాలు దాచుకొన్న సముద్రంలా గంభీరంగా. నవనవోన్మేషంగా. ఒక నవకోమల దేవకన్నెలా సుతారంగా, సునాయాసంగా.

'గిరి'కీలు కొడుతూ, మరుగుతూన్న కాసారంలో పడి, సంసారంలో ఘనీభవించి, ప్రచండమైన పట్టుదలతో బయటపడి, ఈదుతూ, క్షమిస్తూ, కాపాడుకుంటూ అనేక వర్షాలు ప్రయాణించి హఠాత్తుగా ముత్యపు చిప్పలాగ తళుకులీనుతూ తేలింది అమెరికా వేదికల పైనా, అంతర్జాలంలోనూ అనసూయాదేవి.

బురదలో కమలంలా వికసించింది. పారిజాతంలా పరిమళించి, పసిఫిక్ మహాసముద్రతీరంలో పవ్వళించింది. ఈమె వింజమూరి రాణి. ఒక సనాతన భారతీయ స్త్రీ.

*గగనానికి ఆవల*

*గగనానికి ఆవల కొత్త నక్షత్రం ఒకటి పూసింది. రంగు చిగురాకు పచ్చ.*

*దాని అందాన్ని చూసి అరుంధతి రెండు చేతులతోనూ దగ్గిరకి తీసుకొని బుగ్గలని ప్రేమగా పుణికి ఇట్లా అంది.*

*మానవుల్ని జయించి వచ్చిన పిల్లవటగా. చెల్లీ, నీ పేరేమిటి?*

*అనసూయ, అని బదులిచ్చింది.*

*కింద పచ్చటి మొక్కజొన్న చేలు నవ్వుతూ, మెదలు సారిస్తూ, గాలికి రెపరెపలాడుతూ ఊగుతున్నై.*

గౌరవ సమర్పణం

వంగూరి చిట్టెన్ రాజు గారికి. ఈ పుస్తకాన్ని అచ్చు వేసినందుకు, ఒక్క అక్షరం మార్చనందుకు, ఆమెని ఒప్పించి వ్రాయించినందుకు. ఈ భూమిపై, ఖడ్గపాళిపై నర్తించి జయించిన అవసరాల అనసూయాదేవి అనబడే వింజమూరిరాణిని తెలుగుతల్లి కిరీటంలో పొదిగినందుకు, జాతికి సమర్పించినందుకు. - చండాలుడు